క్లుప్తంగా

దుబ్బాకలో తీవ్ర ఉద్రిక్తత

దుబ్బాకటౌన్: పోలింగ్‌కు ముందు రోజు బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు దుబ్బాక పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. బీఆర్‌ఎస్ నాయకులు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఆందోళనలు చేపట్టడం, పలు వార్డుల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి 12.30 నుంచి 3 గంటల వరకు పోలీస్‌స్టేషన్ వద్ద బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తన కేడర్‌తో కలిసి ఆందోళనకు దిగారు. బీఆర్‌ఎస్ నాయకులు సైతం పోటాపోటీగా ఉండడంతో పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారింది. సీపీ శ్వేతతో పాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని బీజేపీ నాయకులను అక్కడి నుంచి పంపించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

దుబ్బాక నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి తన స్వగ్రామం పోతారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. దుబ్బాక ఉమ్మడి మండలంలోని బొప్పాపూర్‌లో బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు, తొగుట మండలం తుక్కాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే నియోజకవర్గంలో పర్యటించి అభ్యర్థులు పోలింగ్ సరళిని పరిశీలించారు.

గజ్వేల్‌లో రాత్రి 9 గంటల వరకు ఓటేసిన ప్రజలు



గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో బారులు తీరిన ఓటర్లు

గజ్వేల్: చెదురుముదురు ఘటనలు మినహా గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సాయంత్రం 5 గంటల వరకు మొత్తంగా ఉన్న 274654 ఓటర్లలో నియోజకవర్గంలోని గజ్వేల్, మలుగు, వర్గల్, జగదేవ్‌పూర్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో 76.17శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత రాత్రి 9 గంటల వరకు ప్రజలు ఓటు వేయడానికి బారులు తీరడం కనిపించింది. దీంతో పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంల తరలింపునకు చాలా సమయం పట్టింది. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోగల ఎర్రవల్లి పోలింగ్ కేంద్రంలో ఈ పరిస్థితి కనిపించింది. వర్గల్‌లో నర్సారెడ్డి తన కుటుంబీకులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎఫ్‌డీసీచైర్మన్ ప్రతాప్‌రెడ్డి తన కుటుంబీకులతో కలిసి స్వగ్రామం గజ్వేల్ మండలం బూర్గుపల్లిలో, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తూప్రాన్: ఓటు వేయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందిన సంఘటన తూప్రాన్ టోల్‌ప్లాజా సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండలం చల్మేడ గ్రామానికి చెందిన భార్య, భర్తలు బాజా గణేశ్, భార్య లావణ్యలో మేడ్చల్ నుంచి చల్మేడ గ్రామానికి వెళ్తున్న క్రమంలో టోల్‌ప్లాజా సమీపంలో 44వ జాతీయ రహదారిపై వెనకాల నుంచి లారీ ఢీకొంది. ఈ సంఘటనలో భార్య అక్కడిక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఓటు వేయడానికి వెళ్లే ముందు గ్యాస్ సిలిండర్‌కు పూజలు చేస్తున్న హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

- హుస్నాబాద్



అక్కన్నపేట: క్యూలైన్‌లో మహిళలు



మీర్జాపూర్‌లో బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని అయా గ్రామాల్లో గురువారం ఓట్లు వేసేందుకు ప్రజలు బారులు తీరారు. మీర్జాపూర్‌లో ఈవీఎంలో సాంకేతిక సమస్యలతో పోలింగ్ ఆలస్యమైంది. రాత్రి 6.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గంలో పోలింగ్ సరళిని పరిశీలించిన ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి బెన్‌షాలోం పట్టణంలో ఎల్లమ్మ బజారులోని పోలింగ్ స్టేషన్ 13లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బెజ్జంకిలో స్వల్ప ఘర్షణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గుండారంలో సాయంత్రం ఆరు గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది. బెజ్జంకిలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను గులాబీ కలర్ షర్టు వేసుకోవడంతో కాంగ్రెస్ నాయకులతో స్వల్ప ఘర్షణ సాగింది.

ఇబ్బంది పడిన ఓటర్లు

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పోలింగ్ సెంటర్‌లో పది నిమిషాల పాటు ఈవీఎం మిషన్లు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఏసీపీ సతీష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

ఓటు కోసం కదలిన వృద్ధులు

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు వినియోగించడానికి వృద్ధులు ముందడుగు వేశారు. స్టాండ్ సహాయంతో పోలింగ్‌స్టేషన్లకు నడుచుకుంటూ వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి దంపతులు పట్టణంలోని 38వ పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మర్కూక్‌లో..

మర్కూక్(గజ్వేల్): మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు కొనసాగింది.

మల్లంపల్లి మందకొడిగా..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మల్లంపల్లిలోని 75వ పోలింగ్ బూత్‌లో మందకొడిగా సాగడంతో సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు క్యూలైన్‌లో బారులు తీరారు. అలాగే మసిరెడ్డితండా, మోత్కుపల్లి, పెద్ద తండా, చౌటపల్లి తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల వరకే 90 శాతం వరకు పోలింగ్ నమోదైంది. కట్కూర్‌లో దాదాపు 20 మంది పేర్లు ఓటర్ లిస్టులో లేకపోవడంతో కొంతసేపు బీఎల్‌ఓలతో వాగ్వాదానికి దిగారు.

కేశనాయక్‌తండా ఓటర్ల అలక

మండలంలోని కేశనాయక్ తండాలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయకపోవడంపై తండా వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గొల్లపల్లిలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో పోలీసులు నచ్చజెప్పారు. అనంతరం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మొరాయించిన ఈవీఎం, వీవీప్యాట్‌లు

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గ పరిధిలోని చేర్యాల పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలోని మొత్తం 49 బూత్‌లకు చెందిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన ఓటింగ్ 11 గంటల అనంతరం పుంజుకుంది. కొన్ని బూత్‌ల్లో ఈవీఎం, వీవీప్యాట్‌లో నెలకొన్న సాంకేతిక లోపాల కారణంగా పోలింగ్ నిలిచిపోయింది. ఆకునూరులో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తమకు డబ్బులు ఇవ్వలేదని ఆందోళన చేశారు. పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాల, పెద్దమ్మగడ్డ పాఠశాల, బాలికల పాఠశాలతో పాటు మండలంలోని ముస్త్యాల గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పట్టణ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

అరగంట ఆలస్యంగా..

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మిరుదొడ్డిలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. 92 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని రాజగోపాల్‌పేట, వెంకటాపూర్ గ్రామాల్లో కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించడంతో వెంటనే అక్కడే ఉన్న మరో ఈవీఎంలను ఏర్పాటు చేశారు. నంగునూరు, ఘణపూర్, కొండంరాజ్‌పల్లి గ్రామాల్లో పోలింగ్ సమయం ముగిసినా ఓటర్లు క్యూలో ఉండడంతో రెండు గంటల పాటు ఓటింగ్ నిర్వహించారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సిర్సనగండ్ల, మంగోల్ గ్రామాల్లో ప్రజలు గుంపులు గుంపులుగా గుమికూడడంతో పోలీసులు చదరగొట్టారు. దుద్దెడలో బీజేపీ అభ్యర్థి తరుపున ఓటర్లను ప్రలోభపెడుతున్నారన్న ఫిర్యాదు మేరకు మాజీ ఉపసర్పంచ్ శివకుమార్‌ను కొద్ది సేపు పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలిపెట్టారు. దుద్దెడలోని 88 బూత్‌లో ఈవీఎం ఆలస్యంగా పని చేయడంతో ఓటర్లు ఎక్కువ సేపు క్యూలో నిలబడాల్సి వచ్చింది.

రాయపోలు(దుబ్బాక): మండలంలోని అనాజీపూర్‌లో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. కాగా రాయపోలు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు రాయపోలు, అనాజీపూర్ తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

కోహెడలో..

కోహెడ(హుస్నాబాద్): కోహెడలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సిద్దిపేట అర్బన్‌లో..

సిద్దిపేటఅర్బన్: మండలవ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించారు. మిట్టపల్లిలో సినీ హీరో సంపూర్ణేశ్ బాబు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి దూది శ్రీకాంత్‌రెడ్డి ఆయా గ్రామాలలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.

వర్గల్‌లో..

వర్గల్(గజ్వేల్): వర్గల్ తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా రూరల్ సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై విజయభాస్కర్ బందోబస్తు నిర్వహించారు.

ఓటింగ్ సరళిని పరిశీలించిన హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్ మండలాల పరిధిలో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ సందర్శించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి ఇర్కోడ్‌లో ఓటు వేయగా, ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, ఎంపీపీ బాలకృష్ణ, జెడ్పీటీసీలు లక్ష్మి, శ్రీహరిగౌడ్ వారి వారి స్వగ్రామంలో ఓటు వేశారు. రూరల్, నారాయణరావుపేట మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ సరళిని మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గంగాపూర్‌లోని 198వ పోలింగ్ కేంద్రంలో, చిన్నకోడూరులోని 208 పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో రెండు గంటలు ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది, ఆయా గ్రామాల్లో పోలింగ్ సరళిని మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో మొత్తం 17 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఎంపీపీ తలారి కీర్తన మర్రిముచ్చాలలో జెడ్పీటీసీ సిద్దప్ప మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగించారు. సీపీఎం అభ్యర్థి కనుకారెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సందర్శించారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తల్తెకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని ముబారస్‌పూర్, దొమ్మాట, ఉప్పరపల్లి గ్రామాల్లో సాయంత్రం 5 గంటలలోపు క్యూలో ఉన్న ఓటర్లకు పోలింగ్ అధికారులు అవకాశం కల్పించారు.



చంద్లాపూర్‌లో ఓటర్లకు నమస్కరిస్తున్న హరీశ్‌రావు



దుబ్బాక: ఓటు వేయడానికి స్టాండ్ సహాయంతో వెళ్తున్న వృద్ధురాలు



బెజ్జంకి: ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న రసమయి బాలకిషన్



సిద్దిపేటరూరల్: ఓటు వేసిన అనంతరం సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, తదితరులు



హుస్నాబాద్: ప్రజలను చెదరగొడుతున్న పోలీస్‌లు



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో మోడల్ పోలింగ్‌స్టేషన్



గట్లమల్యాలలో వృద్ధుడికి బీపీ చెక్ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



కొండపాకలో..



రాయపోలు: అధికారులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి



వర్గల్‌లో..



కొమురవెల్లి: సాయంత్రం ఐనాపూర్‌లో బారులు తీరిన ఓటర్లు



చేర్యాల: పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నమస్కరిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ములుగు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు



దౌల్తాబాద్: సూరంపల్లి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత